# వరంగల్ వాయిస్

Evening Daily

www.warangalvoice.net

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 258 శనివారం | 20 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## 24న సీఎం బహిరంగ సభ

స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే కడియం

2 లో..



# కాంగ్రెస్ కంచుకోటలో.. కావ్యకే జై!

వరంగల్ లోక్ సభపై ప్రత్యేక ఫోకస్


పాగా వేసేందుకు పక్కా స్కెచ్

రంగంలోకి సీఎం రేవంత్ రెడ్డి

కడియం కుటుంబానికి అండగా నిలుస్తున్న క్యాడర్

వరుస సమావేశాలతో బిజీబిజీ

ప్రచారంలో దూకుడు పెంచిన నేతలు



వివరాలు 2లో..

ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఓరుగల్లులో తిరిగి పాగా వేసేందుకు ఆ పార్టీ నేతలు సిద్ధపడుతున్నారు. పక్కా ప్లాన్ తో వ్యూహ రచన చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని అత్యధిక అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయం సాధించి ఊపుమీదున్న కాంగ్రెస్ పార్టీ వరంగల్ లోక్‌సభ సీటుపై కన్నేసింది. స్టేషన్ ఘన్ పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, సీనియర్ పొలిటీషియన్ కడియం శ్రీహరి ఎంట్రీతో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరింది. వరంగల్ లోక్ సభ అభ్యర్థిగా కడియం శ్రీహరి తనయ డాక్టర్ కడియం కావ్య బరిలోకి దిగడం కలిసొచ్చే అంశంగా మారింది. సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగడంతో ప్రచారంలో దూకుడు పెంచారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహిస్తూ నియోజకవర్గంలోని కార్యకర్తలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని సెగ్మెంట్లలో సుడిగాలి పర్యటనలు చేస్తూ కార్యకర్తల్లో జోష్ పెంచుతున్నారు. ఈ నెల 24న కడియం కావ్య నామినేషన్ వేయనున్న నేపథ్యంలో అదే రోజు సీఎం వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించడం ప్రాధాన్యం నెలకొంది. కావ్య నామినేషన్ ప్రక్రియలోనూ సీఎం రేవంత్ పాల్గొననున్నారు. దీంతో క్యాడర్‌లో ఉత్సాహం ఉప్పొంగుతోంది. - వరంగల్ వాయిస్, వరంగల్



8లో

## రైల్వే లైన్ తీసుకొస్తా..

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా

బీజేపీతోనే దేశం అభివృద్ధి

ఆ పార్టీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్



## ఎన్ఎస్‌ఈ డీజీగా నళిన్ ప్రభాత్

ఉమ్మడి ఏపీలో సమర్థుడైన అధికారిగా గుర్తింపు

8 లో..



2లో

## బీఆర్ఎస్ గెలుపు ఖాయం

పార్లమెంటు ఎన్నికల్లో విజృంభించాలి

మన కార్యకర్తల్ని ఇబ్బంది పెడితే ఉరికించి కొట్టాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపు



8లో

## పాఠశాలల్లో వసతులు కల్పించాలి


హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

# కాంగ్రెస్ కంచుకోటలో..
# కావ్యకే జై!



వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..

**వరంగల్ లోక్ సభపై ప్రత్యేక ఫోకస్**
**పాగా వేసేందుకు పక్కా స్కెచ్**
**రంగంలోకి సీఎం రేవంత్ రెడ్డి**
**కడియం కుటుంబానికి అండగా నిలుస్తున్న క్యాడర్**
**వరుస సమావేశాలతో బిజీబిజీ**
**ప్రచారంలో దూకుడు పెంచిన నేతలు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో 17 లోక్ సభ సీట్లుండగా అందులో 14 సీట్లను హస్తం గతం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహ రచన చేస్తోంది. హైదరాబాద్ శివారు తుక్కుగూడలో జన జాతర సభ ద్వారా లోక్ సభ ఎన్నికల శంఖారావం పూరించిన కాంగ్రెస్ ప్రచారంలో దూసుకుపోతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఇదే వేదికగా ఆరు గ్యారంటీలను సోనియా గాంధీ ప్రకటించారు. ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇదే ఒరవడి తిరిగి దేశంలోనూ కొనసాగుతుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు.. జూన్ 9న ప్రధాన మంత్రిగా రాహుల్ గాంధీ ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే రోజున తెలంగాణ నుంచి 14మంది ఎంపీలను వెంటబెట్టుకొని ఢిల్లీకి పోనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పలు బహిరంగ సభల్లో స్పష్టం చేశారు. ఇప్పటికే అభ్యర్థులు వారి నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేయగా వారి వెంట సీఎం, మంత్రులు ప్రచారంలో పాల్గొంటున్నారు. త్వరలోనే ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. రాష్ట్రంలో వీలైనన్ని ఎక్కువ సభలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. సోనియా గాంధీని కూడా ప్రచారానికి ఆహ్వానించాలని భావిస్తున్నారు. కార్యకర్తల్లో జోష్ పెంచేందుకు కాంగ్రెస్ అగ్రనేతలను రంగంలోకి దిగుతున్నారు.



వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..

## వరంగల్ పై ప్రత్యేక ఫోకస్..

మొదటినుంచి వరంగల్ లోక్ సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలిచింది. టీడీపీ, బీఆర్ ఎస్ పాలనలో ఈ స్థానం చేజారినా తిరిగి కైవసం చేసుకునేందుకు పక్కా ప్లాన్ తో ముందుకు సాగుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున అత్యధిక ఎంపీ సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ హై కమాండ్ ధీమాతో ఉంది. తెలంగాణ ఇచ్చిన పార్టీగా జనంలో మంచి ఆదరణ ఉందని, వంద రోజుల్లోనే ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఐదు అమలు చేయడం ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలను ప్రజలనుంచి మంచి స్పందన వస్తోందని వాటిని విస్తృతంగా జనంలోకి తీసుకుపోవాలని రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేస్తున్నారు.

## బలం పెరిగింది..

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పదింటిని కైవసం చేసుకొని ఊపుమీదున్న కాంగ్రెస్ లోకి సీనియర్ పొలిటీషియన్, స్టేషన్ ఘన్ పూర్ బీఆర్ ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వచ్చి చేరడంతో మరింత బలం పుంజుకుంది. దీంతో వరంగల్ లోక్ సభ సీటుపై కన్నేసిన కాంగ్రెస్ కు విజయం నల్లేరు మీద నడకలా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నందున వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తమవుతోంది.

## సుడిగాలి పర్యటనలు..

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కడియం కావ్య సుడిగాలి పర్యటన చేస్తున్నారు. వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి, పర్కాల, పాలకుర్తి, స్టేషన్ ఘన్ పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కడియం ఫ్యామిలీ విస్తృత ప్రచారాలు నిర్వహిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర క్యాడర్ ను కలుపుకొని పోతున్నారు. అవకాశాన్ని బట్టి సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. లీడర్లు, క్యాడర్ తో మమేకమవుతూ కడియం మార్క్ ను చూపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ద్వారా చేకూరే ప్రయోజనాలను వివరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పాంచ్ న్యాయ్ లను ప్రజలకు చేరువ చేయాలని సూచిస్తున్నారు. ప్రతి సమావేశంలో కడియం శ్రీహరితోపాటు కడియం కావ్య గత పది సంవత్సరాల్లో బీజేపీ, బీఆర్ ఎస్ పార్టీలు తెలంగాణకు చేసిన ద్రోహాన్ని ఎండగడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రజలకు జవాబుదారీగా ఉంటామంటూ హామీ ఇస్తున్నారు. అదే విధంగా స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సైతం పలు నియోజక వర్గాల్లో పర్యటించి పార్టీ శ్రేణులకు ఒక్కతాటి మీదికి తీసుకొస్తున్నారు. బీఆర్ ఎస్ పార్టీ క్యాడర్ లో ఎక్కువ భాగం శ్రీహరి వెంటే రావడంతో అక్కడ మెజారిటీ సాధించడం తేలికైంది.

## 24న నామినేషన్..

కాంగ్రెస్ పార్టీ వరంగల్ లోక్ సభ అభ్యర్థిగా కాడియం కావ్య ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనడం ప్రాధాన్యం చేకూరింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా 24న సీఎం వరంగల్ లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇందుకోసం హనుమకొండ జిల్లా మడికొండ సమీపంలో వేదికకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే రోజు ముఖ్యమంత్రి ఆశీస్సులతో కావ్య నామినేషన్ దాఖలు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

# బీఆర్ఎస్ గెలుపు ఖాయం



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ ఎస్ కార్యకర్తలు, నాయకులు విజృంభించాలి. విజయమే లక్ష్యంగా కృషి చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమన్నారు. చిన్న గ్రామంగా ఉండే భూపాలపల్లిని కేసీఆర్ హయాంలో ఎలా అభివృద్ధి జరిగిందో కళ్లకు కనిపిస్తోందన్నారు. బీఆర్ ఎస్ పాలనలో చెప్పినవి, చెప్పనవి ఎన్నో హామీలు అమలు చేశాం. కాని కాంగ్రెస్ పాలనలో డిసెంబర్ 9న రుణమాఫీ, మహిళలకు రూ.2500, పెన్షన్ రూ.4 వేలు లాంటి హామీలు నాలుగు నెలలైనా అమలుకు నోచుకోలేదని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి గురించి నాకు బాగా తెలుసు. అప్పుడు డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామన్నారు.. ఇప్పుడు ఆగస్టు 15 అంటున్నారు.. అప్పుడు కూడా చేయకుంటే ప్రభుత్వం రద్దు చేస్తామని రాసివ్వాలని డిమాండ్ చేశారు. బ్రోకర్ మాటలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. నేను ఛాలెంజ్ చేస్తున్నా.. వరంగల్ పార్లమెంట్ లో ఎగిరేది గులాబీ జెండానే అంటూ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి కేసీఆర్ ను ఓడించామన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందన్నారు. మళ్లీ ఓటేసి రుణం తీర్చుకునేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. కడియం శ్రీహరి పార్టీకి మోసం చేసి పోయాడని ఆరోపించారు. కష్ట సమయంలో అండగా ఉన్నవాళ్లు మన కార్యకర్తలే అని గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ ఎస్ గెలుపు ఖాయమైందన్నారు. మీరు చురుగ్గా పనిచేస్తే బ్రహ్మాండమైన విజయం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివాలా తీసిందని దుయ్య బట్టారు. రాష్ట్ర ఆదాయం తగ్గిందని దీంతో దోపిడీ పెరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే భూముల విలువ అమాంతం పడిపోయిందన్నారు. ఈ ప్రభుత్వం జీతాలు ఇవ్వని పరిస్థితిలో ఉందన్నారు. కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే నేను మధ్య వచ్చి కూర్చుంటానంటూ హామీ ఇచ్చారు. ఎన్నో పోరాటాలు చేశాం.. మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటాం.. పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతిఒక్కరు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ మధుసూదన చారి, బస్వారాజు సారయ్య, ఏనుగుల రాకేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 24న సీఎం బహిరంగ సభ
## స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే కడియం

**వరంగల్ వాయిస్, కాజీపేట :** ఈ నెల 24న కాజీపేట మండలం మడికొండ ఈనాడు కార్యాలయం ఎదురుగా నిర్వహించనున్న వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ భారీ భహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో శనివారం స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్థల పరిశీలన చేసి ఏర్పాట్లపై చర్చించారు. ఎక్కడా ఎలాంటి లోటు పాట్లు లేకుండా, సభకు వచ్చే ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చూడాలని నేతలకు సూచించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు భారీగా తరలివచ్చి భహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

## మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జన జాతర సభలో జనం కోసం ముఖ్యమంత్రి బస్ లో పడి గాపులు పడే, దౌర్భాగ్య పరిస్థితులు దాపురించయని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, రవీందర్ రావు విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 132 రోజులైనా నేటికీ 2 లక్షల రూపాయల రైతు రుణాలను ఎందుకు మాఫీ చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేకపోవడంతోనే ప్రాజెక్టులు, జలాశయాల్లో నీరు లేక ఎండిపోయాయన్నారు. రాష్టంలో కరువు సాధారణంగా వచ్చింది కాదని, కాంగ్రెస్ పార్టీ తెచ్చిందాన్నారు. పార్టీలు మారిన బీఆర్ఎస్ నేతలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. మహబూబాబాద్ లోకసభ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పి చైర్ పర్సన్ అంగోతు బిందు, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ రాంమోహన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పరకాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో వాకర్స్‌ను కలిసిన కడియం కావ్య



**వరంగల్ వాయిస్, కేయూ :** వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య ప్రచారంలో భాగంగా వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ కాకతీయ యూనివర్సిటీలో మార్నింగ్ వాక్ లో కడియం కావ్య వాకర్స్ ను కలిసి తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ ప్రచారంలో టీపీసీసీ కోఆర్డినేటర్ తౌటం రవీందర్-ఝాన్సీరాణి, హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ విష్ణుదాసు వంశీధర్ రావు, సీనియర్ నాయకులు నాంపల్లి ప్రభాకర్, గూడెపు మొగిలయ్య, నల్ల సత్యం, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హంస సేవపై గ్రామ బలి హరణం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నాలుగో రోజు శనివారం ఉదయం హంస సేవపై గ్రామ బలి హరణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం దేవాలయం నుంచి పెద్ద అయ్యగారు ఇంటి వరకు పెరిక వాడ మీదుగా గురూజు దగ్గర హనుమాన్ గాంధీ విగ్రహం, కటిక వాడ, కురుమవాడ మీదుగా ఆలయానికి చేరుకుంది. ఈ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ పులిగిల్ల వెంకటరమణ నరసింహ శాస్త్రి, ఆలయ ప్రధాన పూజారి తిరుమల శ్రీధర్ ఆచార్యులు, వద్దిరాజు ప్రశాంత్, బోలు గొడ్డు అనిల్, పాలకుర్తి రవళి సుమన్, బొల్లెపల్లి సరిత సుదర్శన్, విలాసాగరం శ్రీను, చిన్న, సోమ మనోహర్, శంకేసి అనిల్, కురుమ కర సేవకులు జిగిరి పూర్ణ చందర్, మండల రాంబాబు, బండ సాంబయ్య, బుర్రి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో కాంగ్రెస్ పాపాలను కడిగిన పార్టీ బీజేపీ

## బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్



**వరంగల్ వాయిస్, రేగొండ :** భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గూడెపల్లిలో వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పాపాలను కడిగిన పార్టీ బీజేపీ, అంతర్గత కుమ్ములాటలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు చేసే ప్రచారాలను తిప్పి కొట్టాల్సి అవసరం ఉందన్నారు. ముచ్చటగా మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే దేశాన్ని 100 సంవత్సరాల అభివృద్ధి చేస్తుందన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందని కాంగ్రెస్ విష ప్రచారాలు చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కల్లబోల్లి మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి,కానీ చేతలు తంగేళ్లు దాటడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చారు. కానీ, ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రపంచ నాయకుడిగా కీర్తి ప్రతిష్టలు అందుకుంటున్న వ్యక్తి మన ప్రధానిగా ఉండటం మన దేశ ప్రజలకు శ్రీరామ రక్ష అని అన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చేసి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో చేసిన అభివృద్ధిని వివరించాలని తెలిపారు. ఆర్టికల్ 370, కాశ్మీరి సమస్య పరిష్కారం మన మోడీ, అమిత్ షా ల వల్లే సాధ్యమైందన్న విషయాన్ని ప్రతి పౌరుడికి తెలియజేయాలని కోరారు. నన్ను గెలిపించండి, వరంగల్ పార్లమెంట్ పరిధిలో ప్రతి సమస్య తీరుస్తానని అరూరి హామీ ఇచ్చారు. మామునూరు ఎయిర్ పోర్ట్ పనులు పూర్తి చేయిస్తానన్నారు. అలాగే భూపాలపల్లి రైల్వే లైన్ తీసుకొని వస్తానన్నారు. హనుమకొండ మడికొండలో గల ఐటీ హాబ్ ని విస్తరించి అనేక ఐటీకంపెనీలు వచ్చే విధంగా కృషి చేస్తానని మాట ఇచ్చారు. కోడకండ్ల మండలంలో మినీ టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు పనులు పూర్తి చేయించి అనేక పెట్టుబడులు పెట్టి కంపెనీలు తీసుకొని వచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. వరంగల్ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నిశిధర్ రెడ్డి, పార్లమెంట్ ప్రభారీ మురళీ గౌడ్, రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు విజయ రామారావు, అధికార ప్రతినిధి కీర్తి రెడ్డి, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ప్రదీప్ రావు, వరంగల్ హనుమకొండ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంటా రవి కుమార్, పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** పేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బొల్లం అజయ్ మణికంఠ, మారుజోడు రాంబాబు, ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్ అన్నారు. ఈనెల 24న రాంపూర్ లో జరిగే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వస్తున్నారని, సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శనివారం మండలంలోని కూర్చోపెల్లి, కోమల్ల, గోవర్ధనగిరి గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలో భాగంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ లో చేరికలు జరుగుతున్నాయని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పాటు పడుతుందని వారు తెలిపారు. కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ అని వారు వివరించారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే ఏకైక లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడి వలె పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేష్ పటేల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, సీనియర్ మండల నాయకులు కొమురవెల్లి, జీడిగంటి రాజకుమార్, నీలం యువరాజ్, మండల సీనియర్ నాయకులు పోకల శివకుమార్ గుప్తా, నామాల బుచ్చయ్య గౌడ్ పాల్గొన్నారు.

# ఎన్సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పాఠశాల స్థాయిలో ఎన్సీసీలో చేరడం వలన భవిష్యత్తులో విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని హనుమకొండలోని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ రామారావు, పాఠశాల ఎన్సీసీ అధికారి డాక్టర్ కే.వాసు అన్నారు. పాఠశాల స్థాయిలో రెండు సంవత్సరాల ఎన్సీసీ కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు ఈ రెండు సంవత్సరాల కాలంలో శిక్షణద్వారా ఆయుధాల వినియోగం, డ్రిల్, మ్యాప్ లోడింగ్ అంశాలతో పాటు దేశభక్తి , నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాలు, మానసిక, శారీరక వికాసం పెంపొందించామన్నారు. వెపన్ ట్రైనింగ్, పర్సనాలిటీ డెవలప్ మెంట్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, మొదలగు విభాగాలలో శిక్షణ పొంది ఉత్తీర్ణత సాధించిన వారికి ఈ సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని వారు తెలిపారు. భవిష్యత్తులో ఈ సర్టిఫికెట్లు విద్యా ఉద్యోగాలలో చక్కటి అవకాశాలను కల్పించడానికి తోడ్పడుతాయన్నారు. అన్నింటికీ మించి క్రమశిక్షణతో బతకడం ఎన్సీసీ ద్వారా విద్యార్థులు నేర్చుకున్నారన్నారు. దేశభక్తి గల పౌరులుగా విద్యార్థులు ఎదగడానికి ఎన్సీసీని మించినది పాఠశాల స్థాయిలో మరొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణనిచ్చిన ఆర్మీ అధికారులు, ఉపాధ్యాయులు, ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులలో వేగం పెంచండి

## జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



**వరంగల్ వాయిస్,బల్దియా :** అభివృద్ధి పనులలో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శనివారం కమిషనర్ హనుమకొండ పరిధి వడ్డేపల్లి బండ్ పై కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాంపౌండ్ పనులతో పాటు సందర్శకులు వీక్షించడానికి వీలుగా (వ్యూ డెక్)పనులు, సైకిల్ ట్రాక్ ల్యాండ్ స్కేపింగ్ పనులను జూన్ నెల వరకు పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ పీఎంసీ ఇరువురు సమన్వయంతో పనిచేసి బండు పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కరీంనగర్ ప్రధాన రహదారి ఏల్లాపూర్ వద్ద గ్రాండ్ ఎంట్రెన్స్ ఏర్పాటు పనులను పరిశీలించిన కమిషనర్ నిర్దేశిత గడువులో పూర్తి చేయాలన్నారు. ఏనుమాముల ప్రాంతంలోని బాలాజీ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న బ్యూటిఫికేషన్ పనులను పరిశీలించిన కమిషనర్ ఏర్పాటు బాగుందని, హనుమకొండ ప్రాంతంలో కూడా ఇదే తరహాలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఎస్ఈకు సూచించారు. నర్సంపేట ప్రధాన రహదారి వద్ద గల గ్రాండ్ ఎంట్రన్స్ పనులను పరిశీలించిన కమిషనర్ నెలలోగా స్టీల్ ఏర్పాటు పనులు పూర్తి చేయాలన్నారు. క్రిస్టియన్ కాలనీలో పర్యటించి కమ్యూనిటీహాల్ ఏర్పాటు పనులను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎన్ఎమ్ క్లబ్ వద్ద కొనసాగుతున్న జంక్షన్ బ్యూటిఫికేషన్ పనులలో వేగం పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశించారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డా.రాజేష్, హెచ్ఓ రమేష్, ఈఈలు రాజయ్య, సంజయ్ కుమార్, డీఈలు సంతోష్ బాబు, రవికుమార్, సారంగం, రంగారావు, కృష్ణ మూర్తి, అజ్మీరా శ్రీకాంత్, ఏఈ హరి కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్‌లు కరుణాకర్, సంపత్ రెడ్డి, ఇశ్రం శ్రీను, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్

**వరంగల్ వాయిస్, రేగొండ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం, గోరికొత్తపల్లి మండలం, సుల్తాన్ పూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ అంబాల చందు గౌడ్ బీఆర్ఎస్ పార్టీని విడిచి కాంగ్రెస్ లో చేరారు. నూతన గోరికొత్తపల్లి మండలం సుల్తాన్ పూర్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాశెట్టి రాజయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు కానుగుల తిరుపతి ఆధ్వర్యంలో తాజా గ్రామ మాజీ సర్పంచ్ అంబాల చందు గౌడ్ దాదాపు 50 మందితో కలిసి భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే గండ్ర కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గండ్ర మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసి రానున్న పార్లమెంటరీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ



గెలుపు కోసం కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం చేసిన దోపిడీ, నిర్లక్ష్యం, నిర్బంధం మూలంగా ఎంతోమంది సర్పంచుల జీవితాలు అగమయ్యాయని, పల్లెల అభివృద్ధికి ఆస్తులు అమ్ముకొని పనులు చేసినప్పటికీ బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్ లను నిర్లక్ష్యం చేసిన విధానాన్ని ఖండిస్తూ వారందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటూ గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పత్తి తిరుపతి, తాజా మాజీ వార్డు మెంబర్లు గాజర్ల పురుషోత్తం, కోడూరి శ్రీనివాస్, గట్టు రవి, బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు కాశెట్టి వరదరాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గాజర్ల రామదాసు, అంబాల కుమారస్వామి, గాజర్ల వెంకటేష్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.



## సివిల్ ర్యాంకర్‌ను సత్కరించిన డాక్టర్ సుగుణాకర్ రాజు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** సివిల్ ర్యాంకు సాధించి 'ఐఏఎస్ కానున్న రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ ను శనివారం జనగామ ప్రభుత్వ ఆసుపత్రి సూపర్ డెంట్ డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్ రాజ్ సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టి అంచలంచె లుగా అత్యున్నత స్థాయికి ఎదిగిన ప్రణయ్ కుమార్ ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మన ప్రాంతం నుంచి ఐఏఎస్ ర్యాంకు సాధించడం అభినందనీయమని ఆయన అన్నారు. తల్లిదండ్రులకు, గ్రామానికి కీర్తి తెచ్చాడన్నారు. ఈ సందర్భంగా ప్రణయ్ కుమార్ తల్లిదండ్రులు ప్రభాకర్ లక్ష్మిలను ఆయన అభినందించారు. ప్రణయ్ కుమార్ తల్లిదండ్రులు కొయ్యడ ప్రభాకర్, లక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పని చేసిన నారా చంద్రబాబునాయుడు 74వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్యలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చిలువేరు రవీందర్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేయడం జరిగింది. అందులో భాగంగా హైదరాబాద్ ను ఐటీ హబ్ గా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబు నాయుడుదని, అంతేకాకుండా చంద్రబాబు నాయుడు ఆ రోజుల్లో బిల్ గేట్, బిల్ క్లింటన్ లాంటి గొప్ప వ్యక్తులను హైదరాబాద్ కు తీసుకువచ్చి ఎన్నో ఐటీ మల్టీ నేషనల్ కంపెనీలను నెలకొల్పిన గొప్ప చరిత్ర కలిగిన మహా నాయకుడని కొనియాడారు. చంద్రబాబు సేవలను ఈ జన్మదినం సందర్భంగా గుర్తు చేసుకుంటూ వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చిలువేరు రవీందర్, శిరబోయిన రాజు, కాంద్రాతి చిన్న రవి, ఎన్టీఆర్ మొగిలి, కాంద్రాతి రాజు, కాంద్రాతి శ్రీకాంత్, పిట్టల శ్రీనివాస్, పిట్ట సత్యనారాయణ, పూలెపాక సాయికుమార్, సింగారపు మురళి, బరుపట్ల నాగరాజు, అనుముల రాజు పాల్గొన్నారు.

## పోచారం ప్రత్యేక అధికారిగా పెద్ది ఆంజనేయులు



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని పోచారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా పెద్ది ఆంజనేయులు శనివారం బాధ్యతల స్వీకరించారు. పరకాల మండల పరిధిలోని పోచారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా నియమించబడిన శ్రీధర్ స్థానంలోమండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులును జిల్లా కలెక్టర్ నియమించినందున ఈ రోజు ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సాధ్యమైనంత వరకు కృషి చేస్తానని ప్రజా ప్రతినిధులు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వర్గం కవిత గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ స్కూల్ పేర్లతో మోసం


### ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదెల్ల శరత్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పర్మిషన్స్ లేకపోయినా అడ్మిషన్ నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని, అడ్మిషన్లు ముసుగులో ఫీజులు మోత మోగిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదెల్ల శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ తమ్మెర భవన్ లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని శరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంకా విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్ 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ముసుగులో ఫీజులు మోత మోగిస్తున్నాయని అన్నారు. కొన్ని స్కూల్స్ లో అప్పుడే అడ్మిషన్ పూర్తయినట్టు ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చెప్పడం బాధాకరమన్నారు. బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ లో ఫీజులు కొంత తక్కువగానే ఉండగా మిగిలిన ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో మాత్రం పీజుల పేరుతో వసూలు దందా కొనసాగిస్తున్నారన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో పుట్టగొడుగుల పుట్టకొస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో నియంత్రించడంలో ప్రభుత్వాలు, ప్రభుత్వాధికారులు ద్వంద వైఖరిని ప్రదర్శిస్తున్నాయని మండిపడ్డారు. ఇంటర్నేషనల్ స్కూల్స్ పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ వరంగల్ జిల్లా సమితి తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మౌటం శివకుమార్, అభిరామ్, ప్రభాస్, సంతోష్, రాజు, ఖలీల్, నరేష్, గోపి, సాయి పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

### ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ బాలసముద్రంలోని కార్యాలయంలో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలలను నడుపుతూ ఇంటర్ రెండవ సంవత్సరం క్లాసుల పేరు మీద తరగతులు నిర్వహిస్తూ తల్లిదండ్రుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎంసెట్ క్లాస్ నెల పేరుతో రూల్స్ కు విరుద్ధంగా వేసవి సెలవులలో సెకండ్ ఇయర్ క్లాసులు నడుపుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ కార్పొరేట్ జూనియర్ కళాశాలల పైన వెంటనే చర్యలు తీసుకోవాలని డీఐఓను డిమాండ్ చేశారు.

## ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

### స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాస్ రావు




**వరంగల్ వాయిస్, పరకాల :** మండల పరిధిలోని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లకు ఓటు హక్కు వినియోగంపై పరకాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. 85 సంవత్సరాలు దాటిన వారికి ఇంటి వద్దకే వచ్చి ఓటు వేసే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వికలాంగులు, వయోవృద్ధుల కోసం ఆటోలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి మధురిమ, సీడీపీఓ భాగ్యలక్ష్మి, నడికూడ ఎంపీడీఓ శ్రీనివాస్, సీనియర్ సిటిజన్స్ సంఘ ప్రతినిధులు సమ్మయ్య, సారయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, దివ్యాంగులు, వయోవృద్ధులు హాజరయ్యారు.

## కొలతలతో సంబంధం లేకుండా కనీస వేతనం చెల్లించాలి



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** ఉపాధి హామీ చట్టంలో ఉన్న నిబంధనలు అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం గ్రామాలలో ఎండను సైతం లెక్కచేయకుండా మండుటెండలలో మాడిపోతూ ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న వారికి కనీస వేతనం అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తి విఫలమైందని సీపీఎం మండల నాయకులు ఇసంపెల్లి సైదులు అన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం పని ప్రదేశంలో టెంట్, మంచినీరు, మెడికల్ కిట్టు, ప్రతి ఉపాధి కూలికి ప్రమాద బీమా పది లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఉన్న అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారని అన్నారు. ఎండ సమయంలో పనిచేసిన ఉపాధి హామీ కూలీలకు రోజుకు 300 చొప్పున చెల్లిస్తామని చెప్పి కొలతలతో సంబంధం లేదని ప్రకటనలు చేసి ఇప్పుడు కొలతల ప్రకారం చెల్లిస్తారని అంటున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలి బడ్జెట్ ను ఇతర కార్పొరేట్ సంస్థలకు కేటాయించడంలో ఉన్న శ్రద్ధ, ప్రతిరోజు రెక్కాడితే గానీ కడుపునిండని కష్టజీవులు అనేకమంది ఉన్నారని, వారికి రోజు వారి కూలీ కొలతలతో సంబంధం లేకుండా చెల్లించాలని ఆలోచన ఈ ప్రభుత్వాలకు లేదని విమర్శించారు. ప్రజల పట్ల ఉపాధి కూలీల పట్ల శ్రద్ధ వహించే ప్రభుత్వాలు అయితే తక్షణమే కనీస వేతనం అమలు చేసి కొలతలు లేకుండా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, వెంకన్న, సంగీత, అనసూర్య, బాలు, ఎల్లమ్మ, వెంకటమ్మ, భద్రమ్మ, జ్యోతి, మురళి, యాకయ్య, ఐలయ్య, ముత్తయ్య, తదితర కూలీలు పాల్గొన్నారు.

## 23న కేయూ సదస్సును జయప్రదం చేయండి

### విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పాఠ్యపుస్తకాల్లో అశాస్త్రీయ భావజాలాన్నిపెంపొందించే నూతన జాతీయ విద్యా విధానం- 2020ని రద్దు చేయాలని కోరుతూ, కాకతీయ యూనివర్సిటీలో ఏప్రిల్ 23న విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కామర్స్ సెమినార్ హాల్ లొ ఉదయం 10:30 గంటలకు సదస్సు జరుగుతుందని, ఈ సదస్సుకు విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు హాజరై జయప్రదం చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి. లక్ష్మీనారాయణ, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి, ఓయూ ప్రొఫెసర్ పద్మజాషా తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. దేశంలో నూతన జాతీయ విద్యా విధానం అమలు వలన జరిగే పర్యవసనాలు ఈ సదస్సులో చర్చించి, భవిష్యత్ పోరాట కార్యాచరణను ప్రకటించడం జరుగుతుందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యూ, ఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ, బీఎస్ఎఫ్, ఏబీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు మొగిలి వెంకట్ రెడ్డి, రెహెమాన్, బి. నరసింహారావు, భాషబోయిన సంతోష్, మాలోత్ రాజేష్, శివ కుమార్, సాయి కిరణ్, పృథ్వీరాజ్, జస్వంత్, పరిమళ, వేల్పుల చరణ్, మచ్చ పవన్ కళ్యాణ్, నరేందర్, బండారి పృథ్వీరాజ్, అనూష, కావేరి, మమత, లక్ష్మి, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ కేడర్ రోజు రోజుకి ఖాళీ అవుతుంది. పరకాల, నడికూడ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నడికూడ మండలం నుంచి పర్నెం తిరుపతి రెడ్డి మాజీ సర్పంచ్ రాయపర్తి, బొల్లె భిక్షపతి మాజీ జడ్పీటీసీ, జిల్లా రైతు బంధు కో ఆర్డినేటర్, పెండ్యాల విక్రమ్ రెడ్డి ఫర్టిలైజర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వర పల్లి, దార్న చంద్రమౌళి రాయపర్తి సొసైటీ చైర్మన్, అల్లె సంతోష్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు రాయపర్తి, చిగురు మామిడి రాజ్ కుమార్ రజక సంఘం అధ్యక్షుడు రాయపర్తి, చెలుమల్ల ప్రశాంత్ రెడ్డి మండల యూత్ అధ్యక్షుడు రాయపర్తి, పంజాల సారంగపాణి మాజీ వార్డు మెంబర్ పులిగిల్ల, పరకాల మండలం నుంచి బొజ్జం రమేష్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లక్క పేట,బొజ్జం రజిత ఎంపీటీసీ మల్లక్క పేట, బయ్యా రాజేందర్ మాజీ సర్పంచ్ మల్లక్క పేట, బొజ్జం రవీందర్ నీటి సంఘం చైర్మన్ మల్లక్కపేట చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, పరకాల మున్సిపాలిటీ చైర్ పర్సన్ సోదా అనిత- రామకృష్ణ, నడికూడ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాడి ప్రతాపరెడ్డి,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్హాల్ రావు, మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుల నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో తడిసిన ధాన్యం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో అకాల వర్షాలు రైతన్నను నిండాముంచాయి. శుక్రవారం మొదలైన వాన శనివారం సైతం కొనసాగింది. దీంతో వందలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. అయితే టార్పాలిన్లు లేకపోవడంతో వరదలో వడ్లు కొట్టుకుపోయాయి. ధాన్యం నీటిపాలవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. వారం రోజులైనా ధాన్యం కాంటా అవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు కాజీపేటతోపాటు ధర్మసాగర్, వేలేరు, మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. జనగామ జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్‌లో, తరిగొప్పుల మండలంలో భారీ వర్షం కురవడంతో వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. జనగామ జిల్లా జఫర్ గఢ్ మండలం ఉప్పుగల్లు, తిమ్మంపేటతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిసిముద్దయ్యాయి. కాగా, ఈదురు గాలులతో చెట్లు నేలకొరకగా, పలుచోట్ల కరంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. కాగా, వర్షాలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వేసవి ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించింది.

# మోడీతోనే భారత సమగ్రాభివృద్ధి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** నరేంద్ర మోడీ తోనే భారత ధేశ సమగ్రాభివృద్ధి సాధ్యం అవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం తొర్రూరులో స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపీ తొర్రూరు రూరల్ మండల అధ్యక్షుడు బొచ్చు సురేష్ ఆధ్వర్యంలో మండలంలోని చింతలపల్లి, హచ్చు తండాకు చెందిన సుమారు వంద మంది పార్టీలో చేరారు. బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా లేగా రాం మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రదాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల నిర్విరామ కృషి, అంకితభావం, పట్టుదల కారణంగా దేశం వికసిత్ భారత్ దిశగా గొప్ప ముందడుగు వేసిందని తెలిపారు. సబ్ కా సాత్ సభ్ కా వికాస్ నినాదం అక్షరాలా ఆచరణలో చూపెడుతున్న మోదీ భారతీయులందరి జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని అన్నారు. పదేళ్ల క్రితం వరకు కాంగ్రెస్ పాలనలో సర్వం అవినీతిమయం అన్న అపప్రదను మూటగట్టుకున్న దేశాన్ని నేడు అవినీతి రహితంగా మార్చిన ఘనత నరేంద్ర మోడీదేరని తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మరోసారి అఖండ విజయం సాధించడం ఖాయమని, ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోడీ ప్రధాని కావడం ఖాయమని తెలిపారు. దేశంలో ఎక్కడ చూసినా మోడీ -బీజేపీ హవా కొనసాగుతోందని, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రధాని నరేంద్ర మోడీకి కానుకగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి,రూరల్ మండలం ఇంచార్జి కర్ర శ్రీనివాస్ రెడ్డి, తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా నాయకులు రచ్చ కుమార్, కస్తూరి పులేందర్, గట్టు రాంబాబు, పైండ్ల రాజేష్, కొండా యాకన్న, విష్ణు వర్ధన్ చారి, భాస్కర్, రాజకుమార్, శివ, సంతోష్, గణేష్, యాదగిరి, చెన్నారెడ్డి, క్రిష్ణ, నవీన్, కిరణ్, పవన్, రాజు, సుధాకర్, వెంకన్న, రాకేష్, రజినీకాంత్, మహేష్, ప్రవీణ్, వీరేష్ శ్రీధర్, సంతోష్, మహేందర్, బాబురావు, యాకయ్య, తదితరులు పార్టీలో చేరారు.

## ఝాన్సీ రెడ్డి, యశస్విని రెడ్డిలను కలిసిన రియల్టర్ రాజేందర్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిలను తొర్రూరు డివిజన్ కేంద్రానికి చెందిన ప్రముఖ రియల్టర్ బొమ్మన బోయిన రాజేందర్ యాదవ్ శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువా కప్పి బొకే అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జి రేవూరి ప్రకాశ్ రెడ్డికి శాలువా కప్పి బోకే అందించారు. ఈ సందర్భంగా రియల్టర్ రాజేందర్ మాట్లాడుతూ ఈనెల 24న వరంగల్ లో జరిగే బహిరంగ సభలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో 200 మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు 2000 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. గత 16 సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ పేదలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో అనేకమంది పేదలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు చేయడం జరిగిందన్నారు. తొర్రూరు డివిజన్ పరిధిలోని దేవాలయాల నిర్మాణానికి తమకు తోచిన రీతిలో సహాయం చేసినట్టు తెలిపారు. కొన్నిచోట్ల దేవాలయాల నిర్మాణానికి భూమి కొనుగోలు చేసి అందించినట్లు చెప్పారు.పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు చేసినట్లు పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు నాగరబోయిన మహేష్, పుట్ట వెంకన్న, నాయకులు బొమ్మనబోయిన వెంకన్న యాదవ్, ముదసాని సురేష్, బసన బోయిన రాజేష్ యాదవ్, వినోద్ యాదవ్, కుమారి యాదవ్, కొలుపుల కుమారస్వామి, ఎడ్ల ప్రతాప్ రెడ్డి,రాజు, బొమ్మన బోయిన సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ఓటరు అవగాహన సదస్సులు




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల ప్రకారం జిల్లావ్యాప్తంగా ఓటు హక్కు వినియోగం ఓటు నమోదు ప్రాధాన్యతపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు స్వీప్ నోడల్ అధికారి జినుగు మరియన్న తెలిపారు. ఓటు హక్కు, ఓటు వేయడం ఒక సామాజిక బాధ్యత, వంద శాతం ఓటింగ్ తదితర ఓటరు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నవని, అందులో భాగంగా స్వీప్ నోడల్ అధికారి జినుగు మరియన్న ఆధ్వర్యంలో శనివారంమహబూబాబాద్, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గాలలోని పలు పోలింగ్ స్టేషన్లలో ఓటర్ అవగాహన కార్యక్రమాలు, మహబూబాబాద్ పట్టణంలో పలు పోలింగ్ స్టేషన్లలో, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో ర్యాలీలు, లక్ష్మీపురం ( గూడూరు) లో అంగన్వాడీ ఆధ్వర్యంలో రంగోలి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వచ్చే నెల 13న (సోమవారం) జరిగే పోలింగ్ లో పండుగ వాతావరణంలో ఓటర్లందరూ పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేస్తూ పలు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి జిల్లా సంక్షేమ అధికారి వరలక్ష్మి, సీడీపీవో నిలోఫర్, అంగన్వాడీ టీచర్లు, డీఆర్డీఏ సిబ్బంది శ్యామ్, అశోక్, సాంస్కృతిక కలాబృందం రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పునాది అంగన్వాడీలు

### సూపర్ వైజర్ వి.రాజ్యలక్ష్మి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు, పాటలు, అందిస్తూ భవిష్యత్తులో గట్టి పునాదులుగా అంగన్వాడీ కేంద్రాలు నిలుస్తున్నాయని మరిపెడ సెక్టార్ సూపర్ వైజర్ వి.రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మున్సిపాలిటీ కేంద్రంలోని బ్యాంకు కాలనీ అంగన్వాడీ కేంద్రంలో హౌసింగ్ బోర్డు, రాము తండా, సేవా నగర్, గ్యామ తండా, మైనార్టీ కాలనీ, అంగన్వాడీ సెంటర్లు సంయుక్తంగా ఈసీసీఈ డే ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను పర్యవేక్షించేందుకు మరిపెడ సెక్టార్ సూపర్వైజర్ వి.రాజ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అంగన్వాడీ కేంద్రాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులకు ఆట, పాటలతో చదువులు నేర్పించి గ్రాడ్యుయేషన్ పట్టా అందజేసి ప్రైమరీ స్కూలుకు పంపించడం జరుగుతుందన్నారు. పౌష్టికాహారంతోనే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారన్నారు. అంగన్వాడీ టీచర్లు సమయపాలన పాటిస్తూ అంగన్వాడీ కేంద్రాలపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కారంపూడి శ్రీమతి, ఉమారాణి, రజిని, విజయలక్ష్మి, శారద, హలీమా, హెల్పర్లు మాధవి, సునీత, సాలమ్మ ,అరుణ ,చోటి ,తదితరులు పాల్గొన్నారు.

# టెట్ పై ఎన్‌సీటీఈ చైర్మన్‌ను కలిసిన తపస్ రాష్ట్ర బృందం



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** రాష్ట్రంలోని ఉపాధ్యాయుల పదోన్నతులకు టెట్ తప్పనిసరి అని జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి ప్రకటించిన నేపథ్యంలో జరగనున్న టెట్ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా ఇన్ సర్వీస్ టీచర్లలో పలు అనుమానాలు వ్యక్తం కావడంతో వీటిని నివారించడానికి గాను తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర ప్రతినిధి బృందం శనివారం ఉదయం ఎన్ సీటీఈ చైర్ పర్సన్ యోగేష్ సింగ్ ని కలిసింది. ఇటీవల తెలంగాణ టీచర్లకు పదోన్నతులు కల్పించేందుకు టెట్ అర్హత నిబంధన అడ్డంకిగా మారింది. రాష్ట్ర విద్యాశాఖ గతంలో ఎన్ సీటీఈకి లేఖ రాసింది. దీనిపై టెట్ పాస్ అయిన వారికి మాత్రమే పదోన్నతులు కల్పించాలని సూచించింది. దీనిపై మరింత సమాచార కోసం గాను తపస్ రాష్ట్ర బృందం శనివారం ఉదయం ఢిల్లీలోని ఎన్ సీటీఈ చైర్మన్ ను కలిసి పలు విషయాలు ఆయన ముందు ఉంచింది. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఉపాధ్యాయుల పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న టెట్ కు మినహాయింపును కోరారు. ఎన్ సీటీఈ నిబంధనల ప్రకారం లెవల్ అనగా కేడర్ మార్పు కాదు, ప్రైమరీ నుంచి హైస్కూల్ కు మారడమే లెవెల్. స్కూల్ అసిస్టెంట్ నుంచి గెజిటెడ్ హెడ్మాస్టర్ ప్రమోషన్ హైస్కూల్ స్థాయి లెవెల్ లోబడి ఉన్నందున లెవెల్ మార్పుగా పరిగణించబడదని తెలిపారు. 6,7,8 తరగతులు బోధిస్తున్న భాష పండితులకు కూడా లెవెల్ మార్పు లేదని చెప్పారు. వారికి కూడా టెట్ అవసరం లేదని చెప్పారు. ప్రైమరీ పాఠశాలలలో బోధిస్తున్న ఎల్ఎఫ్ఎల్ లకు ప్రమోషన్ పొందాలంటే టెట్ అవసరం లేదన్నారు. ప్రైమరీ పాఠశాలల(1-5తరగతుల) నుంచి హైస్కూల్ కు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్స్ కు వెళ్లానుకునే ఎస్ జీటీలకు మాత్రం పేపర్- 2 టెట్ పరీక్ష రాయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఇన్ సర్వీస్ లో ఉన్న ఎస్ జీటీ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ కోసం టెట్ రాయాలనీ, అలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వమే అర్హత పాస్ పర్సెంటెజ్ కుదించవచ్చని సూచించారు. ప్రత్యేకంగా టెట్ ను నిర్వహించవచ్చని తెలిపారు. సబ్జెక్ట్ బట్టి సిలబస్ రూపొందించుకోవచ్చన్నారు. ఈ విషయాలపై ఎన్ సీటీఈ నిబంధనలకు సడలింపు ఇచ్చుకునే సౌలభ్యం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని ఎన్ సీటీఈ అధికారులు తెలియజేశారని తెలిపారు. అధికారులను ఢిల్లీలో కలిసిన వారిలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, సహాధ్యక్షుడు అయిలినేని నరేందర్ రావు, అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, ఉపాధ్యక్షులు వొద్నాల రాజశేఖర్, ఎస్. వెంకటరెడ్డి లు ఉన్నారనీ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తిని వీరస్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి మునికుంట్ల సంగెం శ్రీనివాస్ తెలిపారు.

## శోభయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకుందాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమాన్ శోభా యాత్రను ప్రశాంతంగా నిర్వహించుకుందామని సెంట్రల్ జోన్ డీసీపీ తెలిపారు. ఈనెల 23 ట్రైసిటిలో నిర్వహించబోయే హనుమాన్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు వివిధ పోలీసులు, వివిధ ప్రభుత్వ విభాగాలతో పాటు శోభాయాత్ర నిర్వాహకులతో డీసీపీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ శోభా యాత్ర సజావుగా కొనసాగేందుకు బందోబస్తు ఏర్పాట్లు, శోభయాత్ర కొనసాగే మార్గాలపై డీసీపీ చర్చించారు. శోభయాత్ర ప్రశాంత నిర్వహణకు నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటించాల్సిన నిబంధనలపై డీసీపీ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ వరంగల్ మహానగరంలో అన్ని మతాలవారు సోదరభావంతో పండుగలను జరుపుకుంటారని, వరంగల్ ప్రజల ఇతర ప్రాంతాల వారికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఇదే రీతిలో ఒకరి మతాన్నిఒకరూ గౌరవించుకుంటూ పండుగలను జరుపుకుందామని డీసీపీ తెలియజేశారు. ఈ సమావేశంలో శిక్షణ ఐపీఎస్ శుభం నాగ్, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, నందిరాం నాయక్, సత్యనారాయణ, వరంగల్ గ్రేటర్ మున్సిపల్ అడిషనల్ కమిషనర్ ఆన్సర్ రషీద్‌తో పాటు ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ ఇన్ స్పెక్టర్లు, రోడ్డు, భవనాలు, మున్సిపల్ అధికారులు, విశ్వహిందూ, భజరంగ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి. అంజన్ రావు, మహబూబాబాద్ డీపీఈఓ బి. కిరణ్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల సుందరయ్య నగర్, ఆర్టీసీ కాలనీ, అనంతారం, రామ్ సింగ్ తండా, కురవి మండలంలోని కురవి,పెద్దతండాలలో గుడుంబా స్థావరాలపై మహబూబాబాద్ ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. ఎస్ హెచ్ఓ జి. చిరంజీవి, ఎస్ టీఎఫ్ సీఐ పి. బిక్షా రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్, వరంగల్, మహబూబాబాద్ ఎక్సైజ్ టీంలు సంయుక్తంగా విస్తృత దాడులు నిర్వహించడం జరిగింది. ఈ దాడుల్లో 13 కేసులు నమోదు చేసి, 8 మందిని అరెస్టు చేశారు. సారాయి(180) లీటర్లు, బెల్లం(400) కిలోలు, (40) కిలోల పటికను స్వాధీనం చేసుకొని (3,000) లీటర్ల బెల్లం పానకాన్ని అక్కడే ధ్వంసం చేయడం జరిగింది. ఈ దాడుల్లో మహబూబాబాద్ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ జి చిరంజీవి, ఎక్సైజ్ సబ్ ఇన్ స్పెక్టర్ ఐ.అశోక్ కుమార్, ఎక్సైజ్ సబ్ ఇన్ స్పెక్టర్ జి మౌనిక, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ స్టేట్ టాస్క్ ఫోర్స్ హైదరాబాద్ పి.బిక్షా రెడ్డి , ఎక్సైజ్ సబ్ ఇన్ స్పెక్టర్ స్టేట్ టాస్క్ ఫోర్స్ హైదరాబాద్ బి బాలరాజు, ఎక్సైజ్ సబ్ ఇన్ స్పెక్టర్ డీటీఎఫ్ మహబూబాబాద్ ఆర్. కిరీటి, ఎక్సైజ్ సబ్ ఇన్ స్పెక్టర్ వరంగల్ ఎన్ ఫోర్స్ మెంట్ జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రజారోగ్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలి

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతి బాయ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లాలో ప్రజారోగ్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. శనివారం ఐడీఓసీలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతి బాయ్ అధ్యక్షతన రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకుడు డాక్టర్ రవీంద్ర నాయక్ ముఖ్య అతిథిగా వైద్య ఆరోగ్యశాఖలోని ప్రోగ్రాం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంచాలకుడు డాక్టర్ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపైన మహబూబాబాద్ జిల్లాని అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో ముందు వరుసలో ఉంచాలని, ట్రైబల్ ఆరోగ్య కేంద్రాలలో సికెల్ సెల్, ఎనీమియా కేసులను నమోదు చేయాలని, కీటక నియంత్రణ వ్యాధుల అదుపుకు ప్రజలలో అవగాహన కార్యమాలు చేపట్టాలన్నారు. ఫోకల్ స్ప్రే కార్యక్రమం, డ్రై డే ఫ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో వెనుక బడిన ఆరోగ్య కేంద్రాల ను గుర్తించి 100 శాతం పూర్తి చేయాలని అన్నారు. క్షేత్ర స్థాయి ఉద్యోగులకు ఇవ్వ వలసిన శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని, జాతీయ టీబీ కార్యక్రమంలో డీబీటీ పూర్తి చేయాలన్నారు. క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం ప్రకారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, హోమియో, ఆయుర్వేద, సిద్ద యోగ ఫిజియోథెరపీ క్లినిక్ లను విధిగా రిజిస్టర్ చేయాలని, చేయించుకొని వారిని గుర్తించి వెంటనే రిజిష్టర్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారికి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి, ప్రోగ్రాం అదికారులు, డాక్టర్ అంబరీష, డాక్టర్ మురళీధర్, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ బిందుశ్రీ, డాక్టర్ విజయ్,డాక్టర్ శ్రవణ్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ రవీందర్ రావు, ఇంచార్జి డీపీహెచ్ఎన్ఓ మంగమ్మ, ఎన్ హెచ్ఎండీపీఓ రుక్మొద్దీన్, వసంత, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో ప్రాణదానం



**వరంగల్ వాయిస్, సుబేదారి :** రక్త కేంద్రంలో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని 18 సంవత్సరాలు నిండిన రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపు మేరకు శనివారం శనివారం చిదురాల శ్రీనివాస్ (బి పాజిటివ్ రక్తదాత) ప్రభుత్వ ఉపాధ్యాయుడు తలసీమియా పిల్లలకొరకు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ రక్తకేంద్రంలో 59వ సారి, అదేవిదంగా తాళ్ల సందీప్ (ఏ బి పాజిటివ్ రక్తదాత) 4వ సారి రక్తదానం చేశారు. వారికి రెడ్ క్రాస్ హనుమకొండ తలసీమియా, సికిల్ సెల్‌తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## పాస్టర్ల మద్దతు కాంగ్రెస్ పార్టీకే



**వరంగల్ వాయిస్, పరకాల :** మున్సిపాలిటీ పరిధిలోని 26 మంది క్రిస్టియన్ పాస్టర్స్ పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ ఆధ్వర్యంలో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డిని కలిసి వారిని సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో కడియం కావ్యకు, కాంగ్రెస్ పార్టీకి ఏకపక్షంగా మద్దతు పలుకుతున్నామని 26 మంది పాస్టర్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ జిల్లా పీఆర్ఓగా మహేష్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ వరంగల్ జిల్లా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ (పీఆర్ఓ) గా గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ కు చెందిన అడుప మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర చైర్మన్ సయ్యద్ షబ్బీర్ అలీ మదాని ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఉస్మాన్ అలీ గురువారం మహేష్ కు నియామక ఉత్తర్వులు అందించారు. ఈసందర్భంగా మహేష్ మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

## విజయవంతంగా ఏఐఎస్ఎఫ్ మోడల్ టెస్ట్



**వరంగల్ వాయిస్, కేయూ :** అఖిల భారత విద్యార్థి సమైక్య(ఏఐఎస్ఎఫ్ ), తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షను హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 9 సెంటర్లలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెహమాన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్ పరీక్షలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి మోడల్ ఎంసెట్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే పరీక్షలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు విద్యార్థులకు సమయం వృధా కాకుండా పరీక్ష ఎలా రాయాలో అనేది కూడా చాలా ముఖ్యమైన విషయం. వీటన్నింటిపైనా ఒక అవగాహన కల్పించేందుకు ఏఐఎస్ఎఫ్ ఏర్పాటు చేసిన మోడల్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, సమాజాన్ని చదవాలని అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని, భవిష్యత్తులో సోషల్ ఇంజనీర్లుగా, డాక్టర్లుగా పని చేయాల్సిన బాధ్యత విద్యార్థుల పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్ కె. కుమారస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు కుంటి పవన్, శ్రీపతి వినయ్, స్పందన, మాలోతు రాజకుమార్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



## ముళ్లపూడి డైరెక్షన్‌లో విశ్వక్‌సేన్

విశ్వక్‌సేన్ ప్రస్తుతం రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో విశ్వక్ సేన్ 10లో నటిస్తున్నాడు. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. హై ఫోర్స్ ఇంజిన్ త్వరలోనే షురూ అవుతుంది. ఫన్ రైడ్ కోసం రెడీగా ఉండండి..అంటూ మేకర్స్ లాంఛ్ చేసిన పోస్టర్లు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాన్ని ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తల్లూరి నిర్మిస్తున్నారు. మరోవైపు ఛల్ మోహన్ రంగ ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వంలో విశ్వక్ సేన్ 11ప్రాజెక్ట్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరిలో నటిస్తున్నాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార సంస్థ బ్యానర్‌తో కలిసి ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో నేహా శెట్టి, అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు.



## శర్వానంద్ మనమే.. మూవీ టీజర్ విడుదల

టాలీవుడ్‌లో ఉన్న మోస్ట్ ప్రామిసింగ్ నటులలో శర్వానంద్ ఒకడు. ఫీల్ గుడ్ జానర్ సినిమాలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇక ఎక్కువగా ఫ్యామిలీ సెంటిమెంట్ సినిమాలతో అలరించే శర్వా.. చివరగా 'ఒకే ఒక జీవితం' అనే సినిమాతో మంచి విజయం అందుకున్నాడు. ఇక శర్వా ప్రస్తుతం శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో మనమే అనే చిత్రంలో నటిస్తున్నాడు. ఈ మూవీలో కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే టైటిల్ గ్లింప్స్ విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మూవీ నుంచి చిత్రయూనిట్ టీజర్ విడుదల చేసింది. ఈ టీజర్ గమనిస్తే.. లండన్ బ్యాక్ డ్రాప్‌లో రానున్నట్లు తెలుస్తుంది. అనుకోకుండా హీరో, హీరోయిన్ లైఫ్ లోకి ఒక బాబు వస్తే ఏం జరుగుతుంది? ఇంతకీ బాబుకు హీరోకు ఏదైన సంబంధం ఉందా? బాబు ప్లాష్ బ్యాక్ ఏంటి అనే స్టోరీతో ఈ టీజర్ సాగింది. ఇక టీజర్‌ను చూస్తుంటే డిఫెరెంట్ లవ్ స్టోరీ ను శ్రీరామ్ ఆదిత్య చూపించబోతున్నట్లు తెలుస్తోంది. పాపులర్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కిస్తోన్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు. ఈ మూవీ నుంచి ఇప్పటికే టైటిల్ గ్లింప్స్ విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే, టీజర్ లో లండన్ బ్రిడ్జ్, థేమ్స్ నదిని కూడా ఇందులో చూడొచ్చు.క్లీన్ అండ్ ఫ్యామిలీ ఎంట్టంనర్ టీజర్ చివరలో హీరోయిన్ కృతి శెట్టి పిల్లాడు ఏడుస్తుండు అంటూ హీరో మీద అరుస్తుంటే.. ఇద్దరిలో ఒకరే ఏడవండి అంటూ శర్వా చెప్పే డైలాగ్ ఆకట్టుకుంటోంది.



## హాట్ బ్యూటీ సన్నీ లియోన్.. మందిర

బాలీవుడ్ హాట్ బ్యూటీ సన్నీ లియోన్‌కు టాలీవుడ్‌లో కూడా మంచి ఫాలోయింగ్ ఉంది. ఎప్పుడు తనదైన ఫోటో షూట్స్‌తోషేక్ చేసే పనిలో ఉంటుంది. అపుడప్పుడు కుర్రాళ్లను షాక్‌కు గురి చేసేలా చేస్తోంది. అంతేకాకుండా..సన్నీ లియోన్ హిందీ, తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో మూవీస్, షోస్, ఐటెం సాంగ్స్ చేస్తూ బిజీగా ఉంది. తెలుగులో మంచు మనోజ్ కరెంట్ తీగ, రాజశేఖర్ గరుడవేగా, మంచు విష్ణు జిన్నా మూవీస్‌లో నటించింది. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం సన్నీ లియోన్ తెలుగులో ఓ సినిమా చేస్తోంది .తాజాగా ఈ సినిమాకి సంబంధించిన టైటిల్,ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు.ఈ మూవీకి 'మందిర'అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఇక పోస్టర్ విషయానికి వస్తే..తలపై కిరీటం ధరించి రాజుల కాలం వస్త్రాధారణలో మహారాణిగా సన్నీలియోన్ లుక్ ఆకట్టుకుంటోంది. అయితే సన్నీ మాత్రం నెగెటీవ్ షేడ్ రోల్‌లో కనిపించబోతున్నట్లు పోస్టర్ చూస్తుంటే అర్థమవుతోంది. ఈ సినిమాకు ఆర్ యువన్ దర్శకత్వం వహిస్తున్నాడు. మందిర సినిమా విషయానికి వస్తే.. సన్నీ లియోన్ ప్రధాన పాత్రలో తమిళంలో 2022లో రిలీజైన ఓ మై ఘోస్ట్‌కు డబ్ వెర్షన్‌గా మందిర తెలుగులో రిలీజ్ కాబోతున్నట్లు సమాచారం. హారర్ కామెడీ కథాంశంతో తెరకెక్కిన ఈ మూవీ ఆడియన్స్ నుంచి డిజాస్టర్ టాక్ మూటగట్టుకున్నది. మొదట పోర్న్‌స్టార్‌గా కెరియర్‌ను స్టార్ట్ చేసిన సన్నీలియోన్.. నటిగా బాలీవుడ్‌లో జిస్మ్ 2మూవీతో అడుగుపెట్టి తనకంటూ ఓ ప్రత్యేకత సంపాదించుకుంది.



## పొడవాటి జుట్టు.. గడ్డంతో

పొడవాటి జుట్టు, గడ్డంతో.. సూపర్ స్టార్ మహేష్ బాబు లేటెస్ట్ లుక్ చూసిన ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేవంటే నమ్మాలి. 'గుంటూరు కారం' తర్వాత మహేష్ బాబు చేస్తున్న సినిమా దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళితో ఉండబోతోన్న విషయం తెలిసిందే. ఎంబి29గా తెరకెక్కనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల నిమిత్తం దుబాయ్ వెళ్లిన టీమ్.. తిరిగి హైదరాబాద్ చేరుకుంది. ఎస్ఎస్ ఎంబిగా గా తెరకెక్కనున్న ఈ సినిమాకు సంబంధించి టీమ్ కసరత్తులు మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులను టీమ్ వేగవంతం చేసింది. దీనికి సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ వీడియోలో మహేష్ బాబుని చూసిన వారంతా.. 'ఏమున్నాడ్రా బాబు' అని, మరీ ముఖ్యంగా మహేష్ బాబు ఫ్యాన్స్ అయితే పండగ చేసుకుంటున్నారు. అంతేకాదు.. మహేష్ బాబు, రాజమౌళి ఈ వీడియోలో పక్కపక్కనే కనిపించడంతో.. త్వరలోనే సినిమాకు సంబంధించిన గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉన్నట్లుగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే రెండు మూడు టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి. ప్రస్తుతానికైతే ఈ సినిమా ఓపెనింగ్ ఎప్పుడవుతుందా? అని అంతా వేచి చూస్తున్నారు. అతిత్వరలోనే.. ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది.

# రైల్వే లైన్ తీసుకొస్తా..

**యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా**

**బీజేపీతోనే దేశం అభివృద్ధి**

**ఆ పార్టీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్**



**వరంగల్ వాయిస్, చిట్యాల :** ముచ్చటగా మూడో సారి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తేనే దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలం జూకల్ గ్రామం నుంచి చిట్యాల మండల కేంద్రం వరకుబీజేపీ యువజన మోర్చ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నా.. నన్ను ఆశీర్వదించి గెలిపించాలంటూ వేడుకున్నారు. ఇవి రాష్ట్ర ఎన్నికలు కాదు.. ఆలోచించి ఓటు వేయాలన్నారు. మోడీ ప్రధాని అయ్యాక దేశం అన్నిట్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. కరోనా సమయంలో దేశ ప్రజలు ఇబ్బంది పడొద్దని ఉచితంగానే వ్యాక్సిన్ పంపిణీ చేసి ప్రజలకు అండగా నిలిచారన్నారు. చిట్యాల మండలంలో పేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు పట్టాలు మంజూరు చేయించే బాధ్యత తను తీసుకుంటానంటూ హామీ ఇచ్చారు. వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపానని ప్రకటించారు. అదే విధంగా వరంగల్ పార్లమెంట్ ను కూడా అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానన్నారు. భూపాలపల్లి ప్రాంత ప్రజల చిరకాల కోరికైన రైల్వే లైన్ తీసుకొస్తానని, ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. నాయిపాక, కోటంచ ఆలయాలను టూరిజం కింద అభివృద్ధి చేస్తానన్నారు. చిట్యాల ప్రజలు చాలా చైతన్యవంతులు ఆలోచించి ఓటు వేసి బీజేపీకి మెజార్టీ ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మోడీ హవా కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిషిదర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తి రెడ్డి, క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మార్తినేని ధర్మరావు, రాష్ట్ర నాయకులు గరికపాటి మోహన్ రావు, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంటా రవికుమార్, పార్లమెంటరీ ప్రబారి మురళిధర్, పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి, అసెంబ్లీ కన్వీనర్ రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ యువజన మోర్చ ర్యాలీతో చిట్యాల మండల కేంద్రం కాషాయ మయం అయింది. పెద్ద ఎత్తున సాగిన ఈ ర్యాలీలో మహిళలు, యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మూడో రోజు నాలుగు నామినేషన్లు

**కొనసాగుతున్న ప్రక్రియ**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా వరంగల్ లోక్ సభ నియోజక వర్గానికి మూడో రోజు శనివారం ముగ్గురు అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ రెండో నామినేషన్ వేశారు. ధర్మ సమాజ్ పార్టీ రిజిస్టర్డ్ (అన్ రికగ్నైజడ్) అభ్యర్థిగా మేకల సుమన్, ఇండిపెండెంట్ గా గాడేపాక అనిల్ కుమార్, ఎంసీపీఐయూ రిజిస్టర్డ్ (బట్ అన్ రికగ్నైజడ్) అభ్యర్థిగా మాస సావిత్రి నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం తొమ్మిది మంది అభ్యర్థులు 11 నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య వెల్లడించారు.

### మతోన్మాద బీజేపీని చిత్తుగా ఓడించండి :

**- ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగొని రవి**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ ప్రజల మధ్య ఉంటూ ప్రశ్నించే ప్రజాగొంతుక చేవెళ్ల పార్లమెంటు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బీఎల్ ఎఫ్ బలపరిచిన ఎంసీపీఐ (యూ) అభ్యర్థి కొత్తపల్లి సావిత్రీ ని అధిక మెజార్టీతో గెలిపించాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగొని రవి పిలుపునిచ్చారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా సావిత్రి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగొని రవి మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం దేశ సంపదని ఉన్నత వర్గాలకు దోచి పెడుతోందని ఆరోపించారు. మతం, దేవుళ్ళ పేరుతో విభజిస్తూ పాలిస్తున్నారన్నారు. ఇలాంటి దుర్మార్గమైన పాలనకు గోరి కట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ప్రజలు మేలుకోకపోతే భారత రాజ్యాంగాన్ని మార్చి ఆ స్థానంలో మనువాదాన్ని తీసుకొచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పనిచేస్తున్న కొత్తపల్లి సావిత్రిని రాజకీయాలకతీతంగా ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ (యూ) అభ్యర్థి కొత్తపల్లి సావిత్రితో పాటు పార్టి కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, హనుమకొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల కేటాయింపు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వరంగల్ లోక్ సభ నియోజకవర్గం పరిధిలోని హనుమకొండ జిల్లాకు సంబంధించిన పరకాల, వరంగల్ పశ్చిమ శాసనసభ నియోజకవర్గాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల(ఈవీఎంల)ను కేటాయించారు. శనివారం హనుమకొండ జిల్లాకు సంబంధించి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇతర అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల కేటాయింపు జరిగింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంల కేటాయింపు అనంతరం హనుమకొండ జిల్లాకు సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్ రూములకు తరలించగా వాటిని అక్కడ భద్రపరిచి సీల్ వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలకు ఎక్కడ కూడా పొరపాట్లు లేకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ, పరకాల ఏఆర్వోలు వెంకటేష్, నారాయణ, ఇతర అధికారులతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రక్త దానంలో ఘనుడు

**59 సార్లు చేసిన ఉపాధ్యాయుడు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరానికి చెందిన సీనియర్ గణిత ఉపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్ శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరంలో 59 వ సారి రక్త దానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. 20 సంవత్సరాల క్రితం తన తోబుట్టువు శస్త్ర చికిత్స నిమిత్తం నాలుగు యూనిట్ల రక్తం అవసరం ఉండగా తనతోపాటు తన మిత్రులతో కలిసి తొలి సారి రక్తం ఇచ్చారు. అప్పుడే రక్తం ఆవశ్యకత తెలుసుకున్నట్లు చెప్పుకొచ్చారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం కనీసం మూడు సార్లు రక్త దానం చేస్తున్నట్లు శ్రీనివాస్ ప్రకటించారు. ఇందుకు గాను 2017 జూన్ 12 వ తేదీన ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ నాటి రాష్ట్ర గవర్నర్ ఈఎస్ ఎల్ నరసింహన్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ రక్త దాత అవార్డు అందుకున్నందుకు గర్వంగా ఉందని శ్రీనివాస్ వెల్లడించారు.




# ఎన్ఎస్ఈ డీజీగా నళిన్ ప్రభాత్

**ఉమ్మడి ఏపీలో సమర్థుడైన అధికారిగా గుర్తింపు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉగ్రవాదులపై పోరు కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్ఈ) డీజీగా ఉమ్మడి ఏపీ కేడర్ కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి నలిన్ ప్రభాత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన నలిన్ ప్రభాత్ మొదట ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఏఎస్పీగా కొంతకాలం ఉద్యోగం చేసి అనంతరం కరీంనగర్, వరంగల్, కడప జిల్లాల్లో ఎస్పీగా పనిచేశారు. కరీంనగర్ ఏసీపీగా ఆయన ఉన్న సమయంలోనే మావోయిస్టు అగ్ర నాయకులు నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్, సంతోష్ సహా పలువురి ఎన్ కౌంటర్ జరిగింది. అప్పట్లో నల్లా ఆదిరెడ్డి పీపుల్స్ రెబరేషన్ ఆర్మీ అనే సాయుధ బలగాన్ని స్థాపించి దానికి బాస్ గా ఉండేవారు. దీంతో పాటు లోకల్ గెరిల్లా స్క్వాడ్స్ (ఎల్ఎస్క్)ను కూడా స్థాపించి, పోలీసులపై పోరాటానికి వాడేవాడు. నళిణ్ ప్రభాత్ కరీంనగర్ ఎస్పీగా ఉన్న సమయంలో నక్సలైట్లు హత్యాయత్నం చేయగా ఆయన తృటిలో తప్పించుకున్నారు. అప్పట్లో రామగుండంలో ఏపీ ఎక్స్ ప్రెస్ రైలులో ఢిల్లీ వెళుతున్న నలిన్ ప్రభాత్ ని నక్సలైట్లు టార్గెట్ చేసి, రైలు బయలుదేరే సమయంలో కాల్పులు జరిపేందుకు పథకం రచించగా అనుకోకుండా రైలు ఒక్క నిమిషం ముందుగానే బయలుదేరడంతో నక్సలైట్ల వ్యూహం ఫలించలేదు. ఆయన హయాంలోనే కరీంనగర్ లో నక్సలైట్లకు భారీగా ఎదురుదెబ్బ తగిలింది. 2004లో డీఐజీ కేడర్లో ఉండగా కేంద్ర సర్వీసులకు వెళ్లిన ఆయన మొదట జాతీయ విపత్తుల విభాగం డీఐజీగా బాధ్యతలు చేబట్టారు. ఆ తరువాత సీఆర్పీఎఫ్, ఐటీబీపీలో పనిచేసి ప్రస్తుతం సీఆర్పిఎస్ లో అదనపు డీజీ హోదాలో ఉన్నారు. విధి నిర్వహణలో నిక్కచ్చి అధికారిగా పేరొందిన నలిన్ ప్రభాత్ కు పలు అవార్డులు, రివార్డులు దక్కాయి. కాగా ఎన్ఎస్ఈ చీఫ్ గా నలిణ్ ప్రభాత్ ఆయన పదవీ విరమణ చేసే 2028 ఆగస్టు 31వ తేదీ వరకు కొనసాగనున్నారు.

# పాఠశాలల్లో వసతులు కల్పించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు కృషి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శనివారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నాగయ్య పల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల, లింగమడుగుపల్లిలోని ప్రాథమిక పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించి వాటి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజేందర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### వరంగల్‌లో..

వరంగల్ కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరంలో శనివారం జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి కమిటీల ద్వారా చేపట్టే పనుల పురోగతిని అధికారులతో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సమీక్షించారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com